

# హైదరాబాద్ వార్త


స్కైలిఫ్ట్‌సాయంతో భవనం పై అంతస్తును పరిశీలించిన అగ్నిమాపక శాఖ డైరెక్టర్

## ఇంకా మంటలు..
# డెక్కన్ మాల్‌లో కొనసాగుతున్న రెస్క్యూ

**అగ్ని ప్రమాదంలో అస్వస్థతకు గురైన ఎడీఎఫ్‌ఓ ధనుంజయ్‌రెడ్డితో పాటు డ్రైవర్ నర్సింగరావు**

**మోస్ట్ ఇంటిన్సివ్ కేర్‌లో డ్రైవర్ ఆపరేటర్ నర్సింగరావు.. పరిస్థితి విషమం**

**మంటల ధాటికి పూర్తిగా దెబ్బతిన్న భవనం**

**భవనాన్ని పరిశీలించిన వరంగల్ ఎన్ఐటీకి చెందిన ఇంజనీరింగ్ నిపుణులు, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ నిపుణులు**

**అగ్ని ప్రమాదం భవనం పరిసరాల్లో వైద్యశిబిరం ఏర్పాటు**

**పొగ కారణంగా అస్వస్థతకు గురైన వారికి మందులు పంపిణీ**

**ఆరో అంతస్తు నుంచి మంటలు రావడంతోనే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చు : విద్యుత్‌శాఖ అధికారి**



ప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బేగంపేట జనవరి 20, ప్రభాతవార్త : సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట నల్లగుట్ట లోని డెక్కన్ నైట్‌వేర్ స్పోర్ట్స్ షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం ప్రారంభమైన మంటలు శుక్రవారం ఉదయం గం 11 (24గంటలు) దాటినా పూర్తిగా ఆరలేదు. భవనం నుంచి పొగలు వస్తూనే ఉన్నాయి. మంటల ధాటికి ఆరు అంతస్తుల ఈ భవనం పూర్తిగా మాడి మసైపోయింది. అయితే చిన్న మంటతో కూడిన పొగను కూడా పూర్తిగా ఆర్పివేసేందుకు అధికారులు రెస్క్యూ కొనసాగిస్తున్నారు. భవనం గోడల పెచ్చులు ఊడిపోయి వెనుక ఉన్న బస్తీలోని కొన్ని ఇళ్లలో పడ్డాయి. అయితే గురువారం ఈ భవనంలో మంటలు ప్రారంభమైన సమయంలో లోపలికి ముగ్గురు వెళ్లారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటుండగా, వారి సెల్‌ఫోన్ల సిగ్నల్స్ చివరగా అగ్ని ప్రమాదం జరిగిన భవనం వద్దే చూపించడంతో వారు అగ్నికి ఆహుతయ్యారా?లేదా మరెక్కడైనా ఉన్నారా?అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదట ఇద్దరు మాత్రమే లోపలికి వెళ్లారని అని అనుమానించినా చివరకు ముగ్గురు సామాన్ల కోసం భవనంలోనికి వెళ్లినట్లుగా తెలుస్తుంది. సంఘటన జరిగిన ప్రాంతాన్ని రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్ర సందర్శించి స్థానికులకు అండగా నిలిచారు. పలు విభాగాలకు చెందిన అధికారులు కూడా ఈ ప్రాంతానికి చేరుకుని భవనం వద్ద చేపట్టాల్సిన చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన వసీం, జునైద్, జహీర్‌లు నిన్న ఘటన జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోయారు. భవనాన్ని అగ్ని మాపక శాఖ డైరక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రాంతీయ అధికారి పాపయ్యతో కల్సి స్కై లిఫ్ట్ సాయంతో పరిశీలించారు. అగ్ని మాపక శాఖ అధికారులు ఈ సంఘటన జరిగినప్పటి నుంచి మొత్తం 40 ఫైరింజన్లతో మంటలను పూర్తిగా ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. మరో వైపు భవనం నాణ్యతను వరంగల్ ఎన్ఐటీకి చెందిన ఇంజనీరింగ్ నిపుణులు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ నిపుణులు. శుక్రవారం పరిశీలించారు. అయితే మాల్‌లో చిన్న మంట కూడా లేకుండా చేసేందుకు భవనం మొత్తం నీరు చల్లాలని వారు నిర్ణయించారు. అనంతరం భవనాన్ని కూల్చేలా చర్యలు చేపట్టేందుకు వారు ప్రణాళికను సైతం రూపొందించారు. సంఘటనా స్థలాన్ని వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించారు.



**అగ్ని ప్రమాదానికి కారణాలివేనా?..** సెల్లార్‌లో ముందుగా మంటలు వచ్చాయని అవి భవనం మొత్తం అంటుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటుండగా, విద్యుత్ అధికారులు భిన్నమైన వాదన విన్పిస్తున్నారు. అగ్ని ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్ కాదని విద్యుత్ శాఖాధికారులు పేర్కొంటుండటం కొంత గందర గోళానికి దారితీస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈ భవనంలో మండే స్వభావం కలిగిన వస్తువులను ఎక్కువగా నిల్వచేయడం మంటల వ్యాప్తికి ప్రధాన కారణంగా భావించాల్సి వస్తుంది. ముఖ్యంగా పెట్రోలు, లెదర్, రెక్సిన్ నిల్వలను భారీగా చేయడం, భవనంలో ఉన్న కెమికల్ బాక్సులు పేలిపోవడం, భారీగా రెక్సిన్, ఫ్యాబ్రిక్స్ మెటీరియల్ నిల్వలు ఉండటం, భవనం లోకి ప్రవేశించేందుకు ప్రధానంగా ఒకే మార్గం ఉండటం, భవనం నాలుగు వైపుల నుంచి వెళ్లేందుకు దారి లేకపోవడం, అగ్ని మాపక శకటాలు వెళ్లి వచ్చేందుకు కనీసం జాగా ఖాళీగా వదలకు పోవడం, ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో ప్రమాద తీవ్రతను మరింతగా పెంచిందని భావించవచ్చు. భవనం జీ ప్లస్ నాలుగుకు అనుమతి తీసుకుని మరో 2 ఫ్లోర్లను అదనంగా నిర్మించారు. సెల్లార్లను పార్కింగ్‌కు ఉపయోగించాల్సి ఉండగా వాటిలో గోదాం (కార్ల షాపీలో ఉపయోగించే రెక్సిన్, తదితర మండే వస్తువులను) నిల్వ ఉంచడం, వల్లే ఈ ప్రమాద తీవ్రతకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.

**అగ్ని ప్రమాద ప్రాంతంలో గాలి కలుషితం..** చిన్నారులు, వృద్దులు బయటకు వెళ్లక పోవడం మేలు. డెక్కన్ నైట్‌వేర్ స్పోర్ట్స్ షాపింగ్ మాల్‌లో మండే తీవ్రత కలిగిన వస్తువులు అధికంగా ఉండటం వల్ల అగ్ని ప్ర మాదం జరిగిన సమయంలో వెలువ డిన పొగ తీవ్రత వల్ల ఆ ప్రాంతంలో గాలి కలుషితం అయిందని, ఇది సుమారు 10కిలో మీటర్ల మేర తీవ్రత చూపే అవకాశం ఉంటుందని, వైద్యులు నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. కెమి కల్ గ్యాస్ గాల్లో కలిసి ప్రమాద తీవ్రతను బట్టి గాలిలో కాలుష్యం వ్యాప్తి చెందుతుందన్నారు. పిల్లలు, వృద్దులు, ఆరోగ్య సమస్య లతో బాధపడేవారు బయటకు వెళ్లక పోవడం మంచిదని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు.

**ప్రాణాలకు తెగించి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు..** అగ్ని ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న ఏడిఎఫ్ఓ ధనుంజయ్ రెడ్డి, డ్రైవర్ (డీఓపీ)ఆపరేటర్ నర్సింగరావు భవనం పైన చిక్కుకున్న వారిని కాపాడారు. పైకి వెళ్లిన వారు మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు భవనం అద్దాలను పగుల గొట్టి నీటిని లోపలకు పంపాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏడిఎఫ్ఓ ధనుంజయ్ రెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ నర్సింగరావులు దట్టమైన పొగను నేరుగా పీల్చడంతో వారిద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సమీపంలోని ఓ ప్రయివేటు అస్పత్రికి మెరుగైన చికిత్స అందించేందుకు తరలించారు. అయితే వీరిద్దరిలో డ్రైవర్ ఆపరేటర్ నర్సింగరావు మోస్ట్ ఇంటిన్సెవ్ కేర్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితికొంత ఆందోళన కరంగా ఉన్నట్లు తెలుస్తుంది.

**టిఫిన్స్ పంపిణీ చేసిన కార్పోరేటర్..** సికింద్రాబాద్ నల్లగుట్ట అగ్ని ప్రమాద ఘటనలో వ్యాపార సముదాయం చుట్టు పక్కల నివాసం ఉన్న ప్రజలకు స్థానిక కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో బస్తీ వాసులకు టిఫిన్స్ పంపిణీ చేసారు. దాదాపు 100నిరాశ్రయులకు ఆహారాన్ని అందించి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించారు.

**వైద్య శిబిరం ఏర్పాటు మందులు పంపిణీ..** అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగతో ఇబ్బంది పడిన కాచిబౌలి బస్తీ తదితర ప్రాంతాల ప్రజల సౌకర్యం కోసం వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిభిరం ద్వారా పొగ కారణంగా అస్వస్థతకు గురైన వారిని పరిక్షించిన వైద్యులు బృందం వారికి మందులు పంపిణీ చేసారు.

**అగ్నిప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసాం..విద్యుత్ అధికారి శ్రీధర్.**

అగ్ని ప్రమాదం ముందుగా ఆరో అంతస్తు నుంచి మంటలు రావడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్యారడైజ్ సబ్ స్టేషన్ డీ ఈ శ్రీధర్ పేర్కొంటున్నారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణం కాదని, ఒక వేళ షార్ట్ సరూ క్యూట్ జరిగి ఉంటే మీటర్లు, తీగలు పూర్తిగా కాలిపోయేవి అని, గురువారం ఫోన్ రాగానే భవనానికి విద్యుత్ సరఫరాను నిలిపివేసామన్నారు. మంటలు వ్యాపిస్తున్న సమయంలో మీటర్లలో విద్యుత్ సరఫరా ఉందన్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటే సబ్ స్టేషన్ లో ట్రిప్ అయ్యేదన్నారు.

**అగ్ని ప్రమాదం సమయంలో దుకాణంలో 17మంది..** అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో డెక్కన్ మాల్‌లో 17మంది ఉన్నారని, ప్రత్యక్ష సాక్షులు తెలియజేసారు. భవనంలో పొగ రావడం ప్రారంభం అయిన వెంటనే అందరూ బయటకు వచ్చేశారని అన్నారు. సామాగ్రి తెచ్చేందుకు వెళ్లిన ముగ్గురు జునైద్(25), జహీర్ (22), వసీం(36)లు చిక్కుకుపోయారన్నారు. వీరంతా గుజరాత్‌కి చెందిన కార్మికులు. వీరిలో జునైద్(32) ప్రమాదం జరిగిన భవనంలోని మూడవఅంతస్తులో ఉంటుండగా, వసీ ం(36)నల్లగుట్టలో తన ఫ్యామిలీతో ఉంటున్నాడు. జహీర్(22)తన తల్లి కుటుంబంతో కల్సి నల్లగుట్టలో నివాసం ఉంటున్నాడు. వీరంతా కూలీలుగా పనిచేసుకుంటూ పొట్టపోషించుకుంటున్నారు. వీరి గురించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం తెలియలేదు.

**భవనం కూల్చివేత సాధ్యమా?..** డెక్కన్ నైట్‌వేర్ స్పోర్ట్స్ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం గురువారం ఉదయం గం 11లకు ప్రారంభమై శుక్రవారం వరకు మంటల్లోనే చిక్కుకుని ఉంది. సాధారణంగా ఏదైనా భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు అంటుకుంటే నాలుగు గంటలకు పైగా మంటలను తట్టుకునే శక్తి ఉండదని, ఐదు గంటల పాటు మంటల్లో చిక్కుకుంటే ఆ భవనాన్ని కూల్చి వేయాల్సి ఉంటుందని, ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రమాదం జరిగిన భవనం ఎల్ ఆకారం లో ఉండటం, దాని పక్కన ఉన్న భవనాలు ఎత్తు తక్కువగా ఉండటం, వెనుక వైపు బస్తీలో ఉన్న ఇళ్లు పాత కాలంలో కట్టినవి కావడంతో ఈ భవనం కూల్చివేయాలంటే పక్కనున్న భవనాలకు నష్టం తప్పదు. అయితే అధికారులు ఈ భవనాన్ని కూల్చేందుకు ఎలాంటి టెక్నాలజీ వాడి పక్కనున్న భవనాలను రక్షిస్తారు అన్న ఆందోళనను పక్కనున్న భవన యజమానులు, బస్తీ వాసులు వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ భవనం అకస్మాత్తుగా కూలిపోయినా చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను కూడా అధికారులు ఇప్పటికే పరిశీలిస్తున్నారు.

## ఈ దుఃఖాన్ని తుడిచేదెవ్వరు!

- కన్నీరు మున్నీరైన మహిళలు
- ఆ బస్తీ వాసులను రోడ్డున పడేసిన అగ్ని ప్రమాదం
- పొగతో ఇళ్లలో ఉండేటట్లు లేకా.. నానా అవస్థలు



బస్తీని వీడి వెళుతూ కన్నీరు మున్నీరు అవుతున్న మహిళలు

బేగంపేట జనవరి 20,ప్రభాతవార్త : సికింద్రాబాద్ రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట మినిస్టర్ రోడ్డులో డెక్కన్ మాల్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో ఆ భవనానికి వెనుక వైపు ఉన్న కాచిబౌలి బస్తీ వాసులు పొగతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంటలు తగ్గినా పొగ ప్రభావం తగ్గకపోవడంతో వారు బస్తీని వదిలి రోడ్డుపైకి చేరాల్సిన దుస్థితి. రోజంతా మంటల సెగ, దట్టమైన పొగతో తీవ్ర ఇబ్బందులకు గురైన వారు శుక్రవారం కూడా ఇళ్లకు చేరుకోలేకపోయారు. బస్తీలోని నివాసం ఉంటున్న వారి సిలెండర్లు భవనం నుంచి వచ్చే మంటల తీవ్రత ఎక్కువైతే పేలిపోయే ప్రమాదం ఉండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా ప్రతి ఇంటిలోని సిలెండర్‌ను తొలగించారు. దీంతో వారు వండుకునే వీలులేకుండా పోయింది. గురువారం అర్ధరాత్రికైనా మంటలు, పొగ పూర్తి స్థాయిలో అదుపులోకి వస్తాయని భావించిన బస్తీ వాసులకు నిరాశే మిగిలింది. శుక్రవారం రాత్రి సమయంలో కూడా భవనం లో స్వల్పంగా మంటలతో పాటు పొగ వస్తుండటంతో వారు ఇంటి బయటనే పరిమితమ వ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు ఆ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా మరికొందరు తాము దూరంగా ఉంటే అగ్ని ప్రమాదం సంభవించిన భవనం కూలిపోయి ఎక్కడ తమ ఇళ్లు కూలిపోతాయో అన్న ఆందోళనతో ఆ ప్రాంతంలోనే బిక్కు బిక్కు మంటూ కాలక్షేపం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం సంభవించిన భవనం చుట్టూ బ్యారికేడింగ్ ఏర్పాటు చేసిన అధికారులు ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించకపోవడంతో కాచిబౌలి వాసులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా తమకు ఉన్న గూడు (ఇళ్లు) ప్రమాదం జరిగిన భవనాన్ని కూల్చే సమయంలో దెబ్బతింటే ఎలా అన్న ఆందోళనతో ఉన్నారు. శుక్రవారం రాత్రికి అయినా ప్రమాదం జరిగిన భవనం లో మంటలు ఆరిపోయి, పొగ తగ్గిపోతే తమ ఇళ్లకు తాము చేరుకోవాలన్న కాచిబౌలి బస్తీ వాసులు ఆశ లు ఫలించలేదు. దీంతో వారు చేసేదేమిలేక అధికారులు చేపడుతున్న చర్యలను గమనిస్తూ కాలం గడుపుతున్నారు.

## పార్కింగ్ విషయంలో ఇద్దరు రౌడీ షీటర్ల మధ్య గొడవ



దాడిలో గాయాల పాలైన రౌడీ షీటర్ సులేమాన్ బోమ్

చాంద్రాయణగుట్ట, జనవరి 20 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో పార్కింగ్ విషయంలో ఇద్దరు రౌడీ షీటర్ల మధ్య శు క్రవారం సాయంత్రం వివాదం జరిగిన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన రౌడీ షీటర్ సులేమాన్ బోమ్ ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చాంద్రాయణ గుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సులేమాన్ బోమ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో సులేమాన్ రౌడీషీటర్. కాగా ఇతని రియల్ ఎస్టేట్ ఆఫీస్ బార్కస్ సలాల వద్ద ఉంది. రియల్ ఎస్టేట్ ఆఫీస్ ముందు సులెమాన్ బోమ్ వాహనాన్ని పార్కింగ్ చేస్తున్న సమయంలో చాంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా నమోదై ఉన్న అలీబైసాల మధ్య పార్కింగ్ విషయంలో వివాదం చేసుకుంది. రౌడీ షీటర్ అలీబైసా తన వద్ద న్న కత్తితో మరో రౌడీ షీటరైన సులెమాన్ బోమ్‌పై దాడి చేయటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయాల పాలైన సులేమాన్ ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరారీలో ఉన్న రౌడీ షీటర్ అలీబైసా కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇద్దరు రౌడీ షీటర్లు కావటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ కేసును చాంద్రాయణగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ 2023 నూతన కార్యవర్గ ఎంపిక

నాంపల్లి, జనవరి 20 ప్రభాతవార్త : భారతదేశంలో కంపెనీ సెక్రటరీల వృత్తిని నియంత్రించడం, అభివృద్ధి చేయడం కోసం పార్లమెంటు కంపెనీ సెక్రటరీల చట్టం 1980 ప్రకారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) ఏర్పాటు చేయబడిన ఒక ప్రధాన వృత్తిపరమైన సంస్థ భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పనిచేస్తుందని, ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రోయాక్టివ్ బాడీ కంపెనీ సెక్రటరీస్ కోర్సులలో విద్యార్థులకు ఉత్తమమైన, అత్యుత్తమ నాణ్యతగల విద్య... సిఎస్ సభ్యులకు అత్యుత్తమ నాణ్యతా సెట్ ప్రమాణాలపై దృష్టి పెడుతుందని, ఇన్స్‌ట్యూట్‌లో 70వేల మంది సభ్యులు, సుమారు 2లక్షలమంది విద్యార్థులు ఉన్నారని, ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ డైమండ్ గ్రేడ్ చాప్టర్‌లో ఒకటి... బాగా శక్తివంతమైంది. హైదరాబాద్‌లో జరిగిన ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో 2023 నూతన కార్యవర్గం ఎన్నుకోబడి 18 జనవరి 2024 వరకు పనిచేయనుంది. ఎన్నుకోబడిన వారిలో ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్‌పర్సన్‌గా సిఎస్ తంగిరాల లలితాదేవి, వైస్‌ఛైర్‌పర్సన్‌గా సిఎస్ అక్షితా సురానా, కార్యదర్శిగా సిఎస్ మంజిత్ బుదా, కోశాధికారిగా సిఎస్ లక్ష్మీనారాయణగుప్తలు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎ.కార్తిక్, పవన్ కంకణి, శిల్ప బంగ్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా రాజవోలు వెంకటరమణ, మహదేవ్ తిరునగరిలు ఎన్నుకోబడినట్లు ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్ తెలియజేశారు.

## నేడు పాతబస్తీలో వైభవంగా శ్యామ్ బాబా భవ్య నిశాన్ యాత్ర



చార్మినార్, జనవరి 20 ప్రభాతవార్త : శ్రీ శ్యామ్ దివానే సంస్థ ఆధ్వ ర్యంలో నిర్మిం చిన శ్రీ పహాడి శ్యామ్ మందిరం భవ్య ప్రాణ ప్రతిష్ట మ హో త్స వం జనవరి నెల 26వ తేదీన జరుగుతుందని సంస్థ ప్రతినిధులు అరుణ్ దకోతియా ప్రవీణ్ కుమార్ అగర్వాల్, రమాకాంత్ గోయల్, అశోక్ సింగానియా, అనిల్ సంఘీ, ఫంకజ్ కుమార్ అగర్వాల్‌లు తెలిపారు. ఘాన్సీ బజార్‌లో వారు ప్రభాతవార్తతో మాట్లాడుతూ శ్రీ శ్యామ్ దివానే సంస్థ మహేంద్రహిల్స్‌లో నిర్మించిన శ్రీ పహాడి శ్యామ్ మందిరం నిర్మాణ పనులు పూర్తియ్యాయని, జనవరి నెల 26వ తేదీన అత్యంత వైభవంగా మందిరం ప్రాణ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 7.31 గంటలకు చార్మినార్ సమీపంలోని శ్రీ మహదేవ్ మందిరం నుంచి శ్రీ శ్యామ్ బాబా భవ్య నిశాన్ యాత్ర ప్రారంభమై మందిరానికి చేరుకుంటుందని, ప్రజ్ఞ పీఠాధిపతి సాధ్వి విభానంద్ గిరి యాత్రకు ముఖ్య అతిధిగా విచ్చేయనున్నారని వారు తెలిపారు. శ్రీ పహాడి శ్యామ్ మందిరంలో 21 నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు 21 కుండీల శ్రీ శ్యామ్ నామ్ మహా యజ్ఞం వైభవంగా జరుగుతుందని, 26వ తేదీన మందిరంలో శ్రీ శ్యామ్ బాబా విగ్రహం స్థాపన కార్యక్రమం జరుగుతుందని వారు తెలియజేశారు.

## సిటీ కళాశాలలో నూతన విద్యా విధానం.. సవాళ్లుపై జాతీయ సదస్సు

చార్మినార్, జనవరి 20 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాలలో శుక్రవారం కళాశాల అలుమ్ని కమిటి, ఐక్యూఏసి సంయుక్త ఆధ్వర్యంలో నూతన విద్యా విధానం 2020- ఉన్నత విద్యా సంస్థలలో స్థిరమైన శ్రేష్టత, సాధనలో పూర్వ విద్యార్థుల పాత్ర-అవకాశాలు, సవాళ్లు అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సిటీ కళాశాల విద్యార్థినని చెప్పుకోవటానికి గర్విస్తున్నానని తెలిపారు. వంద సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ సిటీ కళాశాల భారతదేశంలోనే సమున్నత విద్యా సంస్థ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఆచార్యులు వెంకటరాజాం, హైకోర్టు పూర్వ రిజిస్ట్రారు విద్యాధర్ భట్‌లు ఆత్మీయ అతిధులుగా పాల్గొన్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సదస్సులో మాజీ శాసన సభ్యులు ఇంద్రసేనారెడ్డి, ప్రముఖ పాత్రికేయులు, రచయిత మందలపర్తి కిశోర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, సిటీ కళాశాల పూర్వ అధ్యాపకులు, రచయిత్రి డాక్టర్ పరిమళ సోమేశ్వర్‌లు ప్రసంగించారు. ఈ కార్యకమంలో సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాల భాస్కర్, సంచాలకులు డా. పావని, డా. భాన్కర్, డా. ఘ నాన్సీ, డా. కోయి కోటీశ్వరరావు, డా. శారద, బిఆర్ఎస్ నాయకురాలు గుంటి మంజుల రాణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీ లేకుండానే వ్యాపారాలు

**ఎన్ఓసి లేకుండానే వాణిజ్య సముదాయాల నిర్వహణ**

**రాజకీయ పరపతితో అనుమతులు పొందిన యజమానులు**

**సాధారణ తనిఖీల్లో నోటీసులతో సరిపెడుతున్న అధికారులు**

**ఏదైనా ప్రమాదం జరిగినప్పుడే హడావిడి**



హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త: ధనార్జనే ధ్యేయంగా నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, కమర్షియల్ బిల్డింగ్ యాజమాన్యాలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. అవినీతికి మరిగిన వివిధ శాఖల అధికారులు నిబంధనలకు అనుగుణంగా లేకపోయినా బహుళ అంత స్తుల కార్పొరేట్ కార్యాలయాలు, ఆసుప త్రుల, క్లినిక్‌లకు అనుమతులిచ్చేస్తు న్నారు. ఇక ఆయా శాఖల అనుమతులు లేకపో యినా చేతులు తడపడంతో చూసీ చూడనట్లుగా ఉత్తుత్తి నోటిసులతో సరిపెడుతున్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఏవైనా విషాద ఘటలు జరిగినప్పుడు మాత్రం హడావిడి చేస్తున్న పరిస్థితులు సర్వసాధారణంగా మారాయి. హైదరాబాద్‌లోని 90శాతం హాస్పిటళ్లు, వాణిజ్య సముదాయాల్లో ఫైర్‌సేఫ్టీ నిబంధనలు సక్రమంగా పాటించడం లేదు. ఈవిషయంపై గతంలో జీహెచ్‌ఎంసి కొరడా ఝులిపించినప్పటికీ ఫలితం లేకపోయింది. గ్రేటర్‌లో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 30వేల వాణిజ్య భనాలు ఉన్నాయి. ఇందులో ఫైర్‌సేఫ్టీ ఉన్నవి 2500లోపు మాత్రమే. ఈలెక్కను 27వేలకుపైగా భవనాల్లో అధికారికంగా అగ్నిమాపక ఏర్పాట్లు లేవు. అనధికారికంగా వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. వినియోగం, విస్తీర్ణాన్ని బట్టి 1000 చదరపు మీటర్లు, నిర్ణీత అంతస్తులు దాటిని భవనాల్లో ఫైర్‌సేఫ్టీ తప్పనిసరి. కానీ నగరంలో ఆపరిస్థితి లేదు. ఫైర్‌సేఫ్టీ ఉన్న భవనాల్లో నిర్వాహణ లోపంతో వినియోగించలేని పరిస్థితి. ప్లాన్ ప్రకారం భవనం నిర్మించారా.. ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉన్నాయా అనేది పరిశీలించాకే పట్టణ ప్రణాళికా విభాగం నివాసయోగ్య పత్రం (ఓసి) జారీ చేయాలి, కానీ దీనికి విరుద్ధంగా ఓసీలు ఇస్తున్నారు. దీంతో అగ్నిప్రమాదం జరిగితే క్షణాల్లోనే తీవ్రత పెరుగుతోంది. నిర్ణీత స్థాయి విస్తీర్ణం, ఎత్తు దాటిన భవనాల్లో అగ్నిప్రమాదాలు జరిగి నప్పుడు నియంత్రించేలా ఫైర్ ఎగ్జిట్వింగషర్లు, ఫైర్ హైడ్రెంట్లు, స్ప్రింక్లింగ్ సిస్టమ్, హోస్ రీల్స్, ఫైర్ అలారం ఏర్పాటు చేయాలి. అయితే మెజార్టీ భవనాల్లో నివారణ చర్యలు కనిపించడం లేదు.

**ప్రైవేట్ ఆసుపత్రులూ అంతే ..** జీహెచ్‌ఎంసి రికార్డుల ప్రకారం 1700 హాస్పిటళ్ల 90శాతం హాస్పిటళ్ల ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలకు సరిపడా ఉండకపోడం గమనార్హం. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) హాస్పిటళ్లకు నోటీసులు జారీ చేసింది. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించకపోతే..కఠిన చర్యలు తీసుకుంటామని..క్రిమినల్ కేసులు సైతం నమోదు చేసి భవనాలను సీల్ చేస్తామని హెచ్చరించింది. దీంతో 1013 హాస్పిటళ్లు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించామని సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్‌లను జీహెచ్‌ఎంసికి సబ్‌మిట్ చేశాయి. హాస్పిటళ్లు అందజేసిన వివరాలను పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే నోఅబ్జక్షన్ సర్టిఫికేట్ జారీ చేయాలని, నిబంధనలు పాటించని హాస్పిటల్ భవనాలను సీల్ చేయాలని భావించారు. కానీ అది మధ్యలోనే ఆగిపోయింది.

**ఇవి తప్పనిసరి..** వాణిజ్యసముదాయాల చుట్టూ 4మీటర్ల ఖాళీ స్థలం వదలాలి. భవనాలు ముందు అద్దాలతో మూసివేయకుండా గాలి, వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. ప్రతి భవనంలో పదివేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకులు లేదా సంపులు ఉండాలి. నీటిని తోడటానికి మోటర్లు అమర్చాలి. నియంత్రిక ఉంటే చుట్టూ కంచే ఏర్పాటు చేయాలి. 45లీటర్ల ఫోమ్‌ట్రాలీ కంకరతో సోప్‌పిట్ ఏర్పాటు చేసుకోవాలి. అత్యవసర వేళల్లో ఉపయోగించుక ఓవడానికి రెండో మెట్ల దారి ఉండాలి. అధికంగా విద్యుత్ వచ్చినప్పుడు సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్ల ఏర్పాటు చేసుకోవాలి. ఆసుపత్రులు, షాపింగ్ కా ంప్లెక్స్‌లు హోటళ్లలో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక సిబ్బంది ఆరు నెలలకోసారి మాక్‌డ్రిల్ చేసి చూపించాలి.

## కంటి వెలుగు పేద ప్రజలకు వరంలాంటిది : మంత్రి తలసాని



2వ వార్డు గన్ బజార్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే సాయన్న, గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్, జనవరి 20 ప్రభాతవార్త: పేద ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమం గొప్ప వరంలాంటిదని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ 2వ వార్డులోని గన్ బజార్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్నతో కలిసి తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి కేసిఆర్ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నగరంలోని 91 వార్డులలో 115 శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోసం 250 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. కంటి పరీక్షకు 500 రూపాయలకు పైగా, అపరేషన్ కోసం వేలాది రూపాయలు ఖర్చు అవుతాయని, అటువంటి కార్యక్రమాలు అన్ని ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట్, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, సంతోష్ యాదవ్, సదానంద్ గౌడ్, పెద్దాల నర్సింహ పాల్గొన్నారు.

## కారు పార్కింగ్ చేసి గుడికెళ్లారు.. వచ్చి చూస్తే కాలి బూడిదైంది



బేగంపేట జనవరి 20, ప్రభాతవార్త : కారు పార్కింగ్ చేసి గుడికి వెళ్లి వచ్చే సరికి కారు కాలిపోయిన ఘటన రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఢిల్లీకి చెందిన సీమా అనే మహిళ సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని భరణి కాంప్లెక్సులోని క్యూ 50 అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుంది. హెచ్‌ఆర్ 26ఈ డబ్ల్యు 2805 నెంబరు కలిగిన కారు ఇంటి బయట పార్కింగ్ చేసి ఆలయానికి వెళ్లి వచ్చేసరికి కాలిపోయింది. ఈ ఘటనపై రాంగోపాల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో పక్కనే పార్కింగ్ చేసిన కార్ల యజమానులు కొంత ఆందోళనకు గురయ్యారు.

## ఆటో ఢీకొని యువకుడి మృతి



బేగంపేట జనవరి 20,ప్రభాత వార్త : రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 18వ తేదీన బేగంపేట కొచ్చర్ అపార్ట్‌మెంట్ వద్ద ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సమయంలో ఆ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని యువకుడిని టీఎస్13యూసి 7713 నెంబరు గల ఆటో ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో ఆ యువకుడికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడన్నారు. వెంటనే 108 అంబులెన్స్‌కు కాల్ చేసి గాయపడిన వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సమీపంలో అతని ఆచూకి కోసం ప్రయత్నించగా వివరాలు లభ్యం కాలేదన్నారు. అయితే గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని ఆచూకి తెలిసిన వారు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సబ్ ఇన్స్‌పెక్టర్ కోర్వ గంగాధర్ తెలియజేసారు.

## ఉజ్జయినీ మహాకాళీ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

### 70 రోజులకు రూ 24,60,714లు

బేగంపేట జనవరి 20, ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. 70రోజులకుగాను రూ 24,60,714లు వచ్చినట్లు సహాయ కమీషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలియజేసారు. రూ 23,68,131లు నోట్లు రాగా,రూ 92,583లు చిల్లర నాణెములు వచ్చినట్లు ఆయన తెలియజేసారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటీ కామేష్, మాజీ ధర్మకర్తలు, బ్యాంకు అధికారులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా బాక్స్ డ్రైన్ నిర్మాణం

### కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

అల్వాల్, జనవరి 20 ప్రభాతవార్త: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం అధికార యంత్రాంగంతో కలిసి తిరిమల ఎన్‌క్లేవ్‌లోని బాక్స్ డ్రైన్ మార్కింగ్‌ను కార్పొరేటర్ పరిశీలించడం జరిగింది. మార్కింగ్ విషయంలో కాలనీ వాసులు నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయిన నేపధ్యంలో డిఇఇలు మహేష్ ప్రశాంతితో కలిసి చర్చించారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు అరవింద్ కవిత కాలనీ వాసులు పాల్గొన్నారు.

## లోక కల్యాణం కోసం నవచండీ మహాయాగం



అల్వాల్, జనవరి 20 ప్రభాతవార్త: అల్వాల్ సూర్యనగర్‌లో ప్రతిపాదిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నవచండీ యాగం జరిగింది. సంస్కృతి సంస్కార స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలలో జరిగిన చండీయాగానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. యాగంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ నాగమణి నిర్వాహకులు తోట శివ ప్రసాద్ ఉప్పల రాంబాబు సోమిశెట్టి సుధాకర్ అమర శ్రీనిఆస్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం అభివృద్దే లక్ష్యం

### డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జనవరి 20 ప్రభాతవార్తః సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగంలో నిలపుతున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యాకలాపాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ నేతలు కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు మల్లారి అనిల్ కుమార్, గరికపాటి చంద్రశేఖర్, తోబుల విష్ణులు రూపొందించిన లష్కర్ అభివృద్ధి క్యాలెండర్‌ను సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో అవిష్కరించారు. ఈ కార్యాక్రమంలో యువ నేతలు తీగుళ్ల కిరణ్‌కుమార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ సునిత పాల్గొన్నారు.

## కంటి వెలుగు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నది : దీపాంకర్ పాల్



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు,బిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్

చార్మినార్, జనవరి 20 ప్రభాతవార్త : కంటి వెలుగు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నదని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు,సీనియర్ బిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్ అన్నారు.ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని గులాబ్‌సింగ్ బౌలి జిమ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శు క్రవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్లు వైద్య పరీక్షలు జరిపి కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్నదని ఆయన తెలిపారు.ఘాన్సీబజార్ డివిజన్ పరిధి లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు కంటి వైద్య పరీక్షలు కోసం వచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌కు రూ. 25 కోట్లు నిధులు మంజూరు : రామక్రిష్ణ



విలేకర్ల సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ

కంటోన్మెంట్,జనవరి 20 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు రక్షణ, ఆర్మీ నుంచి సర్వీస్ ఛార్జీస్ కింద రూ.25 కోట్లు నిధులు మంజూరైనట్లు కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినెటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. శుక్రవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్.కె. మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతుందన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం కోర్టులో పిటిషన్లు దాఖలు చేసి రూ.46 కోట్లు తీసుకువచ్చిన ఘనత బిజెపికే దక్కిందన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు సరిపడే విధంగా మంచినీరు సరఫరా చేయడం లేదన్నారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ జిహెచ్ఎంసిలో విలీనం చేయాల లేదా అనే అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విలీనంపై ప్రక్రియ మొదలైందన్నారు. కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసిలో విలీనం చేయాలని కొందరు, చేయకూడదని మరి కొందరు అభ్యంతరాలు తెలుపుతున్నారన్నారు. విలీన ప్రక్రియ జరిగితే అర్మీ రహదారుల మూసివేతపై పటిష్టం చేసే అవకాశాలున్నాయన్నారు. రక్షణ శాఖ బంగ్లాల ఓనర్స్ పరిస్థితి ఏమిటని వివిధ కోనాల్లో అలోచిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయానంద్, ధనుంజయ చారి, అశోక్, కిరణ్,రాజ్ మల్లేశ్, జెనపల్లి శ్రీకాంత్, ఆనంద్ ప్రభు, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం

నాంపల్లి, జనవరి 20 ప్రభాతవార్త : బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఈ నెల 29 ఆదివారం బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ జాయింట్ సెక్రటరీ అచ్చుతరామశర్మ తెలిపారు. స్పెషాలిటీ వైద్యుల సమన్వమం, వివాహ సమాచారం, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య శిబిరాలు, పేదబ్రాహ్మణుల కోసం రాయితీతోపాటు అత్యున్నత వైద్య సలహాలు, సూచనలు వంటి అనేక అంశాలపై ఈ కార్యక్రమంలో వైద్యనిపుణుల ప్రసంగాలుంటాయని రామశర్మ వివరించారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో భారీయెత్తున వైద్యశిబిరాన్ని బ్రాహ్మణుల కోసం ఎలా నిర్వహించాలనే ఆలోచనపై చర్చిస్తారని, అనేకమంది ప్రముఖ వైద్యులు పాల్గొంటున్న ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ బంగారయ్యశర్మ, గౌరవ అతిథిగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవితోపాటు డాక్టర్లు బాలరాజు, కృష్ణ సుబ్రహ్మణ్యం, దివ్యమాలిని, రాంగోపాల్, బిర్లామందిరం ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, ఏబి6 అధినేత విష్ణుదాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వందమందికిపైగా బ్రాహ్మణ వైద్యులకు సన్మాన సత్కారాలు పెద్దయెత్తున నిర్వహించనున్నట్లు అచ్చుతరామశర్మ పేర్కొన్నారు. అధికసంఖ్యలో బ్రాహ్మణులు విచ్చేసి లబ్దిపొంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పేదల ఇళ్లస్థలాలు కబ్జాచేసినవారిపై చర్యలు తీసుకోండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రమణయ్య,పద్మ తదితరులు

హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త: ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ,బిసిల్లోని నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చిన భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను దళిత మహిళా మండలి కోరింది. ఈమేరకు శుక్రవారం మండలి గౌరవ సలహాదారు టి.రమణయ్య,అధ్యక్షులు ఎం.పద్మ, సెక్రటరీ టి.జయమ్మలతోపాటు పలువురు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా శంశిగూడ గ్రామంలోని ప్రభుత్వం 256మందికి ఇళ్లపట్టాలు ఇవ్వగా ఆభూమిని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ బంధువులు కబ్జా చేశారని ఆరోపించారు.

## అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా కంటివెలుగు



రాజీవ్‌గాంధీనగర్ కమ్యునిటి హాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్ గూడ, జనవరి 20, ప్రభాతవార్త : అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగిందని ఎమ్మె ల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వంద రోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షతో పాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, కళ్ల అద్దాలు, మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రజలను దృష్టిలో ఉంచుకుని పథకాలను ప్రవేశపెట్టి అవి పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా కృషి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, డీసీ రవికుమార్, వీరారెడ్డి, రియాజ్, రమేష్, హమీద్, సలాలుద్దీన్, చాంద్‌బాయ్, యోగిరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన

### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జనవరి 20 ప్రభాత వార్త: తార్నాక డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. లాలాపేట్ ప్రొ. జయశంకర్ స్టేడియం, తార్నాక నాగార్జునగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేస్తామని చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విదంగా కంటి వెలుగు పథకాన్ని సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని అందత్వ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని పథకానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కంటి వెలుగుకోసం వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్టాలిన్ క్రిష్ణ వేణి, చింతల కృష్ణ స్వామి, స్మితాకోటేష్ గౌడ్, శైలజ, వనజ, మంజుల, గాయత్రి,కళ్యాణి, ఇందిర ప్రమీళ, మల్కరి పద్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

### ఎమ్మెల్యే వివేకానంద్



విజేతలకు ట్రోఫీని బహుకరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, జనవరి 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ కమాన్ వద్ద బజ్రంగ్‌బలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌కు గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దాదాపు 39 ప్రాంతాల నుండి జట్లు ఈపోటీల్లో పాల్గొనగా మొదటి స్థానంలో నిలిచిన మహేందర్‌నాయక్ జట్టుకు రూ,25వేలు, రెండవ స్థానంలో నిలిచిన పాపన్నపేట జట్టుకు రూ,10వేలు, మూడవస్థానంలో నిలిచిన మోకిలితండా జట్టుకు రూ,5వేల నగదు బహుమానంతో పాటు ట్రోఫీలను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గంలో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో ఇటువంటి టోర్నమెంట్‌లు నిర్వహించేందుకు తనవంతు సహాకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్, నాయకులు జక్కుల శ్రీనివాస్‌యాదవ్, భీమ్‌సింగ్‌నాయక్, జగన్‌నాయక్, విష్ణుయాదవ్, ఫాక్స్ వైస్‌చైర్మన్ నల్లూరి క్రిష్ణ, ఆర్గనైజర్లు వాసు, చందు, ప్రవీణ్, కోచ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ క్రీడాకారుడికి నగదు అందజేత



బాక్సింగ్ క్రీడాకారుడు మహమ్మద్ హుస్సాముద్దీన్ నగదు అందచేస్తున్న టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

అఫ్జల్‌గంజ్, జనవరి 20ప్రభా తవార్త: తెలంగాణ బాక్సింగ్ చాంఫియన్ మహమ్మద్ హుస్సాముద్దీన్‌కు డిస్టినీ గ్రూపు అధినేతలు అహమ్మద్‌ధర్మాన్ని, సయ్యద్ మాక్సూర్ బాక్రీ,హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ కలిసి రెండు లక్షల రూపాయల నగదు బహుమతి అందచేశారు.ఈసందర్భంగా వారు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి క్రీడాకారుని వెతికి వాళ్లను ప్రోత్సహించడంతో టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా,డిస్టినీ గ్రూపు అధినేతలు ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు. మున్ముందు భారత దేశానికి మరిన్ని క్రీడా పోటిలల్లో పాల్గొన్ని పథకాలను తీసుకువస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సభ్యులు ఖాలీద్ అహ్మద్,ముకీం ఖురేషీ, మహమ్మద్ వహిద్ తదితరులు పాల్గొన్నారు.

## గంగ పుత్రుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి: మంత్రి తలసాని



తెలంగాణ గంగపుత్ర సంఘం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

యూసుఫ్‌గూడ, జనవరి 20, ప్రభాతవార్త : గంగ పుత్రుల సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యు లంతా ఐక్యంగా ముందుకు రావాలని తెలంగాణ గంగ పుత్రుల సంఘం అధ్యక్షులు డి.సీ మల్లయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2023 క్యాలెండర్‌ను మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, శాసనసభ్యులు ముఠా గోపాల్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గంగపుత్రుల సొసైటీలలో గంగపుత్రులకు మాత్రమే సభ్యత్వ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దీటి మల్లయ్య, మహిళా అధ్యక్షురాలు ఏకే స్వరూపా, ఉపాధ్యక్షులు కాపర్థి మోహన్‌కృష్ణ, పాక వీరస్వామి, కార్యదర్శులు శీలం రాజుకుమార్, గడప దేవేందర్, పాక దేవేందర్, టంగుటూరి రాజేష్, ఏలుగు వెంకటేశ్వర్లు, ఇటికెల సతీష్, సదానందం, అనిల్‌కుమార్, ధన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటివెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కమిషనర్ సత్యనారాయణ



కంటివెలుగు కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్, జనవరి 20 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం కమీషనర్ సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బంది పనితీరును పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటివెలుగు కేంద్రానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వంచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కళ్ళద్దాలను పంపిణి చేయనున్న విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ శ్రీహరిరాజు, మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయకమిటీ ఛైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్



ఎక్సైజ్ కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న కల్లుగీత సంఘాల సమన్వయకమిటీ నాయకులు

ధర్నాచౌక్, జనవరి 20, ప్రభాతవార్త: కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయకమిటీ ఛైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎక్సైజ్‌శాఖ కమీషనర్ సర్ఫరాజు అహ్మద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బాలరాజుగౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాకు అడ్డంకిగా ఉన్న మెడికల్ బోర్డును తక్షణమే రద్దుచేయాలని కోరారు. అనేక కారణాలతో రద్దు చేయబడిన టీసీఎస్, టీఎఫ్‌టీలను పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ నాయకులు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, గడ్డమీది విజయ్‌కుమార్ గౌడ్, గౌడసంఘం ఉపాధ్యక్షులు పోతగాని ఐలేని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్

ధర్నాచౌక్, జనవరి 20, ప్రభాతవార్త: అపరిష్కృతంగా ఉన్న గ్రంధాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్ తెలిపారు. శుక్రవారం అశోకనగర్‌లోని నగర కేంద్ర గ్రంధాలయ ప్రాంగణంలో గ్రంధలయ ఉద్యోగుల రష్ట్రస్థాయి మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై శ్రీధర్ మాట్లాడుతూ గ్రంధాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని తెలిపారు. అందులో భాగంగానే పలు ప్రాంతాలలో గ్రంధాలయ భవన నిర్మాణాలు, గ్రంధాలయాల ఆధునీకరణ చేపట్టటం జరిగిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గ్రంధాలయ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చాగంటి అయోధ్య గ్రంధాలయ ఉద్యోగుల సమస్యలను వివరించగా, టిఎన్‌జీఓ నాయకులు రాజేందర్, మజీబ్, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్ తదితరులు ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు.

## విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని 24న కలెక్టరేట్ల ముట్టడి

### బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, అంజి

హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెంచాలని, బిసి, ఈబిసి విద్యార్థుల పూర్తి ఫీజులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 24న విద్యార్థుల తరగతుల బహిష్కరణ, ఎమ్మార్వో, కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి, ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం బిసిభవన్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. బిసి విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు 5ఏళ్ల క్రితం నిర్ణయించారని.. ప్రస్తుతం పక్కరాష్ట్రం ఏపీలో విద్యార్థులకు 20వేల స్కాలర్‌షిప్ ఇస్తుంటే .. తెలంగాణలో 5500మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రస్తుత అవసరాల తగ్గట్లు దాన్ని 20వేలకు పెంచాలన్నారు. అలాగే ఇంజనీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బిసి విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీంను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఎస్.టి,ఎస్.సి,మైనార్టీ విద్యార్థులు ఇస్తున్న మాదిరిగా బిసి,ఇబిసి విద్యార్థులకు పూర్తిఫీజులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, అనంతయ్య, నీలవెంకటేష్, సుధాకర్, నర్సింహ్మాగౌడ్, దీపిక, సురేందర్, శశాంక్, నిర్మల ,తార తదితరులు పాల్గొన్నారు.

## పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

### బీజేవైఎం నాయకులు అరుణ్‌కుమార్ కుమార్‌యాదవ్





ధర్నా నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 20, ప్రభాత వార్త : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు అరుణ్ కుమార్ కుమార్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. జెఎన్టీయూసి మెయిన్ గేట్ దగ్గర బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్ పలుపు మేరకు బీజేవైఎం శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయంబర్స్‌మెంట్‌లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ బిజేవైఎం నేషనల్ ఆఫీస్ కో ఆర్డినేటర్ కుమార్ యాదవ్‌లు పాల్గొని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 18లక్షల మంది విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్‌లు 5300కోట్ల రూపాయల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్ ఫీజ్ రీయంబర్స్‌మెంట్ ఇప్పించలేని అసమర్థ విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం రాష్ట్ర నాయకులు ఎ.సాయి పృధ్వీ, తిరుపతిరెడ్డి హరి, రామకృష్ణ, సాయి, శ్రీపతి, రాహుల్, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర సమస్యతో భాదపడుతున్న వారికి కంటి వెలుగు



ఆశ వర్కర్లు, వైద్యులతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్

బేగంబజార్,జనవరి 20 ప్రభాతవార్త: నేత్ర సమస్యతో భాదపడుతున్న వారు కంటి వెలుగు ద్వారా వైద్యపరీక్షలు చేయించుకోవాలని బేగంబజార్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన బేగంబజార్‌లోని ఆరోగ్యఆసుపత్రిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆశవర్కర్లు,వైద్యులతో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నేత్ర సమస్యతో భాదపడుతున్న వారు నేరుగా కంటి వెలుగు కేంద్రాన్ని వచ్చిన ఉచితంగాకంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆశవర్కర్లు,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగును ప్రారంభంలో పాల్గొన్న ఆర్వీమహేందర్‌కుమార్

గన్‌ఫౌండ్రి, జనవరి 20ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యమ నేత, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు ఆర్వీ మహేం దర్‌కుమార్ కోరారు.హిందీనగర్‌లోని ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు కార్యక్ర మాన్ని పనితీరు ఆయన బిఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈసం దర్భంగా కంటి వెలుగు ద్వారా వైద్యసేవలను పొందిన వృద్దులకు ఉచితంగా కళ్ల అద్దాలను అందచేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు ఉమీర్‌సమీరా, నర్సు సుజాత, బిఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు యాదగిరి,శ్యామ్‌సుందర్, వాసుదేవరావు, టి.శ్రావణ్,హన్‌మంత్‌లతో పాటు పుణ్యవతి, రేణుక, బాలమణి, రాంచందరర్ ఆశవర్కర్లు పాల్గొన్నారు.





వాక్‌థాన్‌లో పాల్గొన్న నారాయణ గూడ మెల్కోటీ పార్కు అసోసియేషన్ సభ్యులు

# అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కులు దశలవారిగా అభివృద్ధి చేస్తాం

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ**


పార్కుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ అమృత

హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కులను దశలవారిగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా పార్కుల్లో సుందరీకరణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. నల్లకుంట డివిజన్‌లోని టిఆర్‌టి క్వార్టర్స్‌లోని మోతి నాగేశ్వర్‌రావు పార్కులో 48 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్తాపన చేశారు. ఈ సందర్బంగా కాలేరు మాట్లాడుతూ పార్కుల్లో వృద్దులు, మహిళలు కుర్చోనేందుకు బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతోపాటు పార్కుల చుట్టు ప్రక్కల ప్రహరీ గోడలు నిర్మించడం, టైల్స్, రంగులు వేయడంవివిధ రకాల మొక్కలు నాటడం, పార్కు ముందు భాగంలో అందమైన ఆర్చ్ నిర్మాణం వంటి అనేక పనులు చేపడుతున్నామని వివరించారు. మోతి నాగేశ్వర్‌రావు పార్కులో చేపట్టనున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఎ అధికారి దేవేందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు వేణుగోపాల్, సువర్ణ, దివ్య, వాటర్ వర్క్స్ అధికారి రోహిత్, విద్యుత్ శాఖ అధికారులు సౌమ్య, జ్యోతిబాయి, వివిధ శాఖల అధికారులు పేరిరాజు, భాస్కర్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లంగర్‌హౌస్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, జనవరి 20, ప్రభాతవార్త : లంగర్‌హౌస్ డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయడం జరుగుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం కోట్లాది నిధులను మంజూరు చేసి అభివృద్ధి చెస్తున్నామన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమా సిద్దికితో కలిసి డివిజన్ పరిధిలోని లంగర్ హౌస్, వినాయక నగర్, మందుల బస్తీలలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు బస్తీలు, కాలనీలలో జరుగుతున్న డ్రైనేజీ విద్యుత్, తాగునీటి పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సహకారంతో కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.297 కోట్ల ప్యాకేజీని తీసుకురావడం జరిగిందని తెలిపారు. అందులో లంగర్‌హౌస్ డివిజన్‌లో నెలకొన్న తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను మార్చేందుకు రూ. 18 లక్షలను తక్షణమే మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇతర అభివృద్ధి పనుల కోసం మరికొన్ని నిధులను త్వరలోనే విడుదల చేస్తామన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు మత్యా రేణుక, మాతంగి రమేష్, గోపాలు, విజయ్, శ్రీనులతో పాటు జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ అధికారులతో పాటు స్థానిక బస్తీ వాసులు ఉన్నారు.

# ఫీజులు ఇస్తారా గద్దె దిగుతారా

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**


బీసీ విద్యార్థి సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ధర్నాచౌక్, జనవరి 20, ప్రభాతవార్త: బీసీ విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీరియంబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు ఇస్తారా, గద్దె దిగుతారా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం ఇందిరా పార్కులో బీసీ విద్యార్థి సంఘం కేంద్రకమిటీ 2023 డైరీని అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ చదువు, సామాజిక న్యాయ సాధన కోసం డిసెంబర్ 2 నుండి జనవరి 8 వరకు బీసీ విద్యార్థి యువజన పోరు యాత్ర చేపట్టి బీసీ విద్యార్థులకు రావల్సిన ఫీరియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలంటే మీ సొంత ఆస్థులు ఇచ్చేస్తున్నట్లు బాధపడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తెలంగాణాను అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి బీసీల అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికృష్ణగౌడ్, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సింగం నగేష్‌గౌడ్, బడేసాబ్, బత్తిన్‌రాజుగౌడ్, పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లిఖార్జున్ యాదవ్, జి.నాగరాజుగౌడ్, ఇంద్రం రజక, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రైల్వే పాస్‌లను పునరుద్దరించాలి


జర్నలిస్టులకు రైలేపాస్‌లను ఇవ్వాలని ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

అడ్డగుట్ట, జనవరి 20 ప్రభాతవార్త: జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్‌లను వెంటనే పునరుద్దరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, అధ్యక్షులు అరుణ్ కుమార్, టీ.డబ్ల్యుజె.ఎఫ్. ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్యలు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రైల్వే పాస్‌లను వెంటనే పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ రైల్ నిలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కరోనా కంటె ముందు కొనసాగిన రైల్వే రాయితీని ఎత్తి వేయడంపై మండిపడ్డారు. జర్నలిస్టులకు రద్దు చేసిన రైల్వే రాయితీని తిరిగి పునరుద్దరించాలన్నారు. జర్నలిస్టులకు ఆర్టీసి అందజేస్తున్న పాస్‌ల మాదిరిగానే రైల్వేలో కూడా ప్రవేశపెట్టాలన్నారు. ఈ సందర్బంగా జర్నలిస్టుల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో జర్నలిస్టు నాయకులు రఘు, గండ్ర నవీన్, రాజశేఖర్, సలీమా, నాగవాని, చంద్రమోహన్, వీరేశ్, బ్రహ్మానందం, గుస్క జనార్ధన్, యాదగిరి, సత్యం, నాని తదితరులు పాల్గొన్నారు.

# 22న కుటుంబాల్లో విలువలపై సదస్సు

సైఫాబాద్, జనవరి 20 ప్రభాతవార్త: సంస్కార్ జాగారణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న నారాయణగూడలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో 'కుటుంబాల్లో విలువలు, వ్యవస్థ క్షిణించడం-సమాజంపై వాటి ప్రభావాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని మంచ్ ప్రతినిధి ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో రాజ్యసభ సభ్యుడు, బిజెపి జాతీయ అధికార ప్రతినిధి డా.సుధాన్షు త్రివేధీజీ పాల్గొంటారని చెప్పారు. భారతదేశ జాతీయ విధానం, భారతీయ సంస్కృతి, చరిత్రకు సంబంధించిన వివిధ సమస్యలపై ఆయన ప్రసంగిస్తారని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో కుటుంబ నిర్మాణంలో మార్పులు, భౌతికవాదం, వినియోగదారు వాదంపై భారం, సాంప్రదాయ భారతీయ విలువల వ్యవస్థలో వేగవంతమైన తిరుగులేని మార్పులకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలి


చెత్త పేరుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్‌లో పేరుకుపోయిన చెత్త ఉన్న ప్రదేశాలను ఆమె సందర్శించారు. చెత్తతో స్థానిక ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందని వెంటనే తొలగించాలని కోరారు. ఆమెతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు డివిజన్‌లో సందర్శించారు.

# జంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి


సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు

పేట్‌బషీరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఐడిపిఎల్, సుచిత్రం, కుత్బుల్లాపూర్, కృష్ణకుంజ్, షాపూర్‌నగర్, సూరారం జంక్షన్ల అభివృద్ధి పనులు, జంట సర్కిళ్ళ పరిధిలోని సిసిరోడ్ల అభివృద్ధి పనులపై శుక్రవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ రహిత రహదారులుగా తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యం అని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ ఇబ్బం దులను అధిగమించేందుకు చేపడుతున్న జంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అధికారులం తా సమన్వయంతో ముందుకు సాగి సకాలంలో ప నులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈఉ కృష్ణచైతన్య, గోవర్ధన్, డిఈఈలు రూ పాదేవి, పాపమ్మ, భానుచందర్, ఏఈలు సంపత్, సురేం దర్‌నాయక్, కన్సల్టెంట్ పూజిత పాల్గొన్నారు.

# నిరంతరం విద్యుత్‌ను అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

**తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్‌రావు**


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు

ధర్నాచౌక్, జనవరి 20, ప్రభాత వార్త: నిరంతరం విద్యుత్‌ను అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ కార్మిక డైరీ 2023ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం థర్మల్‌పవర్ (కేటీపీఎస్) రాష్ట్రానికే తలమానికంగా ఉందని అన్నారు. డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ పేరిట విద్య, ఉపాధి, ఆరోగ్య సదుపాయాలను కల్పిస్తోందని, ఇప్పటికే 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షులు ఖాజా మెయినుద్దీన్, ప్రధాన కార్యదర్శి కే.వీ. రామారావు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసాచారి, వి.కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# బిఎస్ మక్తాలో రౌడీ షీటర్ దారుణ హత్య

ఖైరతాబాద్, జనవరి 20, ప్రభాతవార్త: నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ దారుణహత్యకు గురయ్యారు. బిఎస్ మక్తాలో ఉంటున్న సోఫా మేకర్ మహ్మద్ అజార్ అలియాస్ అర్జు (22)ను వరుసకు సోద రుడైన షేక్ మహబూబ్ హతమార్చాడు. ఆస్తి విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో అజార్ పొట్టలో కత్తితో పొడవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంజాగుట్ట ఏసీపీ పి.వి గణేష్, ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# నేత్రపర్వంగా యుగపురుషుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

**నందమూరి తారక రామారావు చిత్రగీతాలు.. శతజయంతి పురస్కారాల ప్రదానోత్సవం**

రవీంద్రభారతి, జనవరి 20 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యుగపురుషుడుగా తెలుగుజాతి హృదయాల్లో నిలిచిపోయిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 24 మంగళవారం మధ్యాహ్నం 2 నుండి రాత్రి 9గంటల వరకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సీల్‌వెల్ సినీసుస్వరాలు శీర్షికన ఎన్.టి.రామారావు నటించిన సినిమాల్లో ఆణిముత్యాల్లాంటి పాటలను ప్రముఖ నవరస గాయని, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని నేతృత్వంలో పలు ప్రముఖ వర్ధమాన గాయకులతో కలిసి సుమధురంగా ఆలపించి వీనులవిందు కావించడంతోపాటు ఎన్.టి.ఆర్ శతజయంతి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు సీల్‌వెల్ సీఎండి బండారు సుబ్బారావు, శృతిలయ ఛైర్మన్ డా. బి.భీమ్‌రెడ్డి, కార్యదర్శి ఆమనిలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విశిష్ట అతిథులు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, అవార్డుల కమిటీ సీనియర్ పాత్రికేయుడు మహ్మద్‌రఫీ, కుసుమ భోగరాజు, ఎం.శివకుమార్, గాయని ఆమని తదితరులతో కలిసి పార్లమెంటు సభ్యుడు, జయభేరి సంస్థల అధినేత, ప్రముఖ నటుడు మురళీమోహన్‌కు ఎన్.టి.ఆర్ సిల్వర్‌క్రౌన్ పురస్కారం, ప్రజామార్గదర్శకుడు కొటికె విఠల్‌కు ఎన్.టి.ఆర్ శ్రమశక్తి పురస్కారాలను ఘనంగా సత్కరించి ప్రదానం చేయనున్నట్లు సుబ్బారావు, భీమ్‌రెడ్డి, ఆమనిలు వివరించారు. అధికసంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు, సినీప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని ఆస్వాదించి విజయవంతం చేయాలని వారు కోరారు.

# బాలికల హక్కులు.. పరిరక్షణకు గళమెత్తాలి


స్వచ్ఛందసంస్థల ప్రతినిధులతో బాలికలు

హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త: బాలికల హక్కులు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గళమెత్తాలని నేటి బాలికలకు చదువే దిక్సూచి అని క్రైస్వచ్ఛంద సంస్థ ప్రతి నిధులు పిలుపు నిచ్చారు. ఈమేరకు శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో స్వచ్ఛంద సంస్థ నుంచి లబ్దిపొంది సమాజంలోని బాలల పరిరక్షణకు కృషి చేస్తున్న రజియా బేగం (పెద్దకొత్తపల్లి) జి.సత్య (జవరహర్‌నగర్), నిమ్మల లింగమ్మ (లింగాల మండలం), పొన్నగంట్టి సోని (మేడ్చల్) తిరుపతమ్మ (కొల్లాపూర్ )మీడియాతో మాట్లాడారు. ఈసందర్బంగా 19ఏళ్ల సోని మాట్లాడుతూ తనతల్లిదండ్రులు రోజువారి కూలీ చేస్తూ తనతోపాటు తన చెల్లులను చదవివించేవారని కొవిడ్ తర్వాత తన కుటుంబ పోషనకు చదవు మానివేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇలా 2ఏళ్లపాటకు విద్య దూరంగా ఉన్నా ..చదువుకోవాలనే కోరిక తనలో ఎప్పుడూ ఆగలేదని.. ఆతర్వాత క్రై మద్దతుతో రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎంఈసిలో చేరినట్లు తెపింది. ఈకార్యక్రమంలో క్రైస్వ చ్ఛంద సంస్థ హిమబిందు, శ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ వై.లక్ష్మణ్ రావు, పివిసిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుకట్ల సుభాష్, పివిసిఆర్, పిఏఆ ర్‌పి హెచ్ఆర్‌సి రాష్ట్ర అర్గనైజర్ కొమ్ము తిరుపతి, సునీల్, మంజుల, ఎస్‌వికె శ్రీనివాస్, విజయా పాల్గొన్నారు.

# పోలీసు వ్యవస్థలో ఓ మంచి వ్యక్తిని కోల్పోయాం : ప్రజా ప్రతినిధులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 20, ప్రభాతవార్త : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీమన్నారాయణ అకాల మృతి పోలీస్ వ్యవస్థకే తీరని లోటని, నేటి సమాజంలో ఓ మంచి వ్యక్తిని కోల్పోయామని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్ నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, టిటిడి బోర్డు సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు హరీష్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీమన్నా రాయణ శుక్రవారం ఉదయం ఆకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాందేవ్ ఆసుపత్రిలో ఉన్న శ్రీమన్నారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలో జన్మించిన శ్రీమన్నారా యణ ఎంతో కాలంగా పోలీస్ వ్యవస్థలో పనిచేస్తూ అధికారుల నుండి మంచి పేరు తెచ్చుకొని ఎన్నో ఆవా ర్డులు, రివార్డులు సాధించుకున్న వ్యక్తి అని, సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.

# రాజీవ్‌నగర్‌లో రోడ్డు నిర్మాణం కోసం వినతి


రాజీవ్‌నగర్‌లో రోడ్డు వేయించాలని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కు వినతి

నాచారం, జనవరి 20 ప్రభాతవార్త: నాచారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ పార్కు సమీపంలో రోడ్డు వేయాలని స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతి సాయిజన్ శేఖర్‌కు స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సయ్యద్ నజీర్, కార్యదర్శి ఎండి నవాబ్ జాన్,ఎన్‌వి ఎష్ శర్మ, వెంకట్‌రత్నం, మురళి,జి. గౌడ్‌పాల్గొన్నారు.


**VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I VASIREDDI LENIN BABU, R/o 1-2-49/PR/505, PRASAD RESIDENCEKUKATPALLY, CYBERABAD, T.S, Change my name as VASIREEDY LENIN BABU.

★ I VASIREDDI KRISHNA VASAVI, R/o 1-2-49/PR/505, PRASAD RESIDENCE,KUKATPALLY, CYBERABAD, T.S, Change my name as VASIREEDY KRISHNA VASAVI.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైనసంబంధం లేదు.


IN THE COURT OF HON'BLE XIX ADDL. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT:: SECUNDERABAD
O.S.NO. 217 OF 2017

**BETWEEN:**
INDIAN OVERSEAS BANK, Loyola Academy Branch, Secunderabad ...PLAINTIFF
AND
B.Sathyander alias B.Sathyendar Rao and Another ..DEFENDANTS

To,
Sri B.Sridhar S/o.B.Raja Gopalarao, C/o.Ayappa Medicals, Loyola College Road, Old Alwal, Secunderabad-500010. (Defendant NO.2)

**DEFENDANT NO.2**

Whereas the Plaintiff above named has filed the above O.S.No. 217 of 2017 for Recovery of Money and the matter stands posted on **28/02/2023** for your appearance.You all are Concerned are hereby required to appear in this court in person or by a pleader on **28/02/2023** at 10.30.a.m. failing which the matter would be decided in your absence in accordance with law.

(BY ORDER OF THE HON'BLE COURT)

**M/s. M.V.S. PRASAD, K.SUBBA RAO**
ADVOCATES FOR PLAINTIFF
Plot No.135/5, Street No.5, M.J.Colony, Gayatri Nagar, Moula Ali, Hyderabad-500 040.
Email: mvsprasad.advocate@gmail.com

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
కుత్బుల్లాపూర్ సర్కిల్-25

నిట్ నం. & తేది: 26/DB/EE/ కుత్బుల్లాపూర్‌సర్కిల్/GHMC/2022-23. 20.01.2023. పనిపేరు: సిసి రోడ్ పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 121.00 లక్షలు. ప్రారంభ తేదీ, సమయం: 23.01.2023 మ.3.00గం. బిడ్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 01.02.2023 మ.3.00గం.లు. ఇఇ పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. సెల్ నం. 9701908887. హెడ్ డ్రాఫ్ట్‌మెన్: సెల్‌నం. 7331186855. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25, GHMC.

DIPR.No.11648-PP/CL/Advt/1/2022-23 తేదీ:20.01.2023

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సంక్షిప్త నిట్ నం.53/SE(M)/Sec-bad zone/GHMC/2022-23 తేదీ: 19.01.2023. క్ర.సం.1. నిట్ నం.: పైన పేర్కొన్నది. పనుల సంఖ్య: 12 పనులు. అంచనా మొత్తం: రూ.868.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం, ప్రారంభం: 20.01.2023 మ.1.00గం. ముగింపు తేదీ/సమయం: 27.01.2023 మ.1.00గం. మొత్తం 12 పనులు. రూ.868.00. అధికారి పేరు, చిరునామా, సెల్ నం. SE, Sec'bad Zone, GHMC. సెల్ నం. 9989930374. తదుపరి వివరాలు www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC.

DIPR.No.11629-PP/CL/Advt/1/2022-23 తేదీ:20.01.2023

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

EE, సర్కిల్-30, బేగంపేట, సికింద్రాబాద్ జోన్ కొటేషన్‌లు పొందడానికి ప్రకటన
నోటీస్ నం.07/సీల్డ్ కొటేషన్స్/EE-30/SD Z/GHMC/2022-23, తేది: 19.01.2023

క్ర.సం.1, ఈ దిగువ పేర్కొన్న ఐటమ్‌ల కొరకు ఉత్పత్తిదారులు, ఫ్యాబ్రికేటరులు, అధీకృత డీలర్లు, ఏజెన్సీల మె॥వారి నుండి సీల్డు కొటేషనులు కోరబడుతున్నవి. పని పేరు: సర్కిల్-30, బేగంపేట, సికింద్రాబాద్, GHMC లో కంటి వెలుగు కార్యక్రమం-2023 కొరకు 1) కీస్ కమ్యూనిటీహాల్ 2) హమాలీబస్తీ బస్తీ దవాఖానా 2) విక్టోరియాగంజ్ కమ్యూనిటీహాల్ 4) పట్టిగడ్డ మోడల్ మార్కెట్ 5) పాత కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీహాల్ 6) డొక్కాలమ్మ ఆలయం వద్ద 2'x4' సైజ్ దీర్ఘచతురస్రాకార ఫోల్డింగ్, ఐరన్ లెగ్స్ యొక్క సరఫరా, బిట్వాడా. **కావలసిన ఐటమ్‌లు:** 1) GHMC డిపార్టుమెంట్ స్టోర్స్‌కు సామగ్రి మొత్తాన్ని ధర మరియు రవాణా కలిపి దీర్ఘచతురస్రాకారం 2'x4' సైజ్ ఐరన్ లెగ్స్ ఫోల్డింగ్ టేబుల్స్ టాప్‌లైట్ టేబుల్ (టాప్ 5 కేజీలు) సరఫరా మరియు బిట్వాడా. 2) అదే స్టోర్స్‌కు ధర, రవాణా కలిపి 6 m x 2 m సైజ్ క్లాత్ సైడ్ వాల్స్ సరఫరా మరియు బిట్వాడా. 3) అదే స్టోర్స్‌కు ధర, రవాణా కలిపి అదేవిధంగా 1.5 m x 0.9 m సైజ్ వైట్ క్లాత్ సరఫరా మరియు బిట్వాడా. డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ, సమయం, కొటేషనుల ప్రారంభం: 21.01.2023 ఉ.10.30 గం. దాఖలు ముగింపు తేదీ: 25.01.2023 సా.5.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: సీల్డు కొటేషనులు EE పై చిరునామాలో 25.01.2023న సా.5.00 గం. లేదా ముందుగా దాఖలు చేయవచ్చును. సెల్ నం.7331189488, 9849906750. గమనిక: యూనిట్స్‌తో రేట్ ప్రతిపాదించబడును. సంబంధిత అధికారి EE మరియు హెడ్ డ్రాఫ్ట్‌మన్ చిరునామాలు పైన పేర్కొనబడినవి. తదుపరి వివరాలు, పై ఐటమ్‌లకు పూర్తి నిర్దిష్టతలను EE, వెబ్‌సైట్ https://ghmc.gov.in/ పై పొందవచ్చును. కొటేషన్‌లను ఆన్‌లైన్ E-mail ID: eec30reports@gmail.com ద్వారా దాఖలు చేయవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట

DIPR.No.11639-PP/CL/Advt/1/2022-23, తేది: 20.01.2023

## కంటి వెలుగును విజయవంతం చేయాలి : ఎర్రోళ్ల శ్రీనివాస్


5వ వార్డు సంజీవయ్య నగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

కంటోన్మెంట్,జనవరి 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయంతం చేసేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని టీ.ఎస్.ఎం.ఎస్, ఐడి.సి.ఛైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రాజకుమారి, డాక్టర్ విశాల్, బిఆర్ఎస్ నేత షర్వేన్, కంటోన్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: HAYATHNAGAR
O.S.No. 1959 of 2022

Between
**Kotha Nikhitha Reddy** ...Plaintiffs
And
**Kotha Venkat Narasimha Reddy & others** ...Defendants

To
All concerned

Take notice that the plaintiffs herein has filed the above suit for declaration, declaring the plaintiffs are the absolute owners and possessors of the suit schedule property being the legal heir of deceased Late Kotha Divya aliyas Neelaveni Reddy **W/o. Kotha Venkat Narasimha Reddy.** The above suit is posted to **02-02-2023** for appearance. If anybody having any objections, claims or interest are hereby directed to appear before this Hon'ble Court on **02-02-2023** at 10.30 a.m. by personally or through an advocate, failing which the matter will be decided on merits.

**SCHEDULE OF PROPERTY**

All that piece and parcel of the open land bearing Plot No.9/part, admeasuring 164 Sq.yards or its equivalent to 137.10 Sq.Mtrs, in Sy.Nos. 98(Part) and 99, Krishna Nagar Colony, Situated at Peerzadiguda Village, Medipally Revenue Mandal, Medchal-Malkajgiri District, under Peerzadiguda Muncipal Corporation, under registration Sub District Keesara and bounded by: North: Plot No.9/Part (Northern Part), South: Survey No.97, East Plot No.100 & 101, West 25' Wide Road

// BY ORDER OF THE COURT//

**ASHOK REDDY**
Advocate
Counsel for Plaintiffs

**PUBLIC NOTICE**

General public are hereby informed that my clients **Mohammed Sadiq S/o Mohammed Abdul Rasheed,** Aged about: 44 years, Occ: Business, R/o H.No.12-5-32/15/2, South Lallaguda, Opposite: Bachpan School, Tarnaka, Secunderabad, Hyderabad-500017 and Smt. Sirisha Chimakurti D/o Sitaramaiah, Aged about: 45 years, Occ: Business, R/o Plot No.15, GVR Enclave, Sailent Avenue, Dammaiguda, Nagaram, Keesara Mandal, Medchal Malkajgiri District entered into Agreement of Sale with the Vendors 1) Morgu Dhsharatha S/o Late Morgu Kistaiah, Aged about: 33 years, Occ: Business, R/o H.No.5-54, Keesara Village and Mandal, Medchal Malkajgiri District 2) Panduga Raju S/o Late Panduga Narshima, Aged about: 32 years, Occ: Business, H.No. 4-60, Keesara Village and Mandal Medchal Malkajgiri District 3) Morgu Bhagyamma W/o Late M. Balaiah, Aged about: 49 years, Occ: House Wife, R/o H.No.5-112, Keesara Village and Mandal, Medchal Malkajgiri District 4) Pandru Satyamma W/o Late Pandru Yadaiah, Aged about: 60 years, Occ: House Wife R/o H.No.5-56, Keesara Village and Mandal Medchal Malkajgiri District on 19.01.2023 for all that the Agricultural Land, in Old Survey No: 348, New Survey No.182/అ, 182/A/ఉ, 182/A/ ఈ, 182/ఉ, 182/ఉ, 182/ఇ,182/B/ఈ, 182/B/ఆ, 182/లు, 182/రు, 182/B/ఎ, 182/B/ఊ, 182/B/ఉ, 182/A/అ, 182/A/ఇ, 182/A/ఇ/2, 182/B/ఉ, Total Extent of Ac. 12.34 1/2 Guntas: situated at Keesara Mandal, Dayara Village, Medchal Malkajgiri District and Bounded on North: 100 Feet Wide Main Road, South: Land Survey No.173, 174, 175 Parts, East: Current Sub Station, West: Rice Gowdown. If any person/s having any right, claim, title, interest, whatsoever in respect of the said property shall contact the undersigned within 7 days from the date of publication with all relevant documents in support of their claim and any claim made subsequently, will not be entertained and shall deemed to have been waived.

**Sd/- J. SRINIVAS,** Advocate
H.No.17-705/1, Indira Nehru Nagar, Malkajgiri, Hyderabad-47.
Cell: 9686299867 / 7799088997
Email: cnu198126@gmail.com

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI: AT L.B. NAGAR
O.S.No. 2599 OF 2022

BETWEEN:
**Sri. Chilkuri Jaipal Reddy...Plaintiff**
AND
**1. Sri. Chilkuri Mohan Reddy, And 11 others ...Defendants**

To.
**D-4. Sri. G.S. Ravindra Kumar,** S/o Late Sahadev Rao, Aged about 51 years, Occ: Pvt Emp, R/o H.No. 16-60, Old Mirjalguda, Malkajgiri, Secunderabad-500047.

**NOTICE**

Whereas the above named Plaintiff have filed the above O.S. aginst you for Cancellation of Sale Deeds vide O.S.No. 2599/2022 on the file of Hon'ble II ADDL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI: AT L.B.NAGAR which stands posted on 03.02.2023 for your appearance and you required to appear before the above said Court on the above said date at 10.30 A.M. either in person or through an Advocate duly Instructed, failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THE HONOURABLE COURT//

**Sd/- G. PAVAN KUMAR**
**J. RANGA REDDY**
Advocate
H.No.3-11-473/1, Shiva Mahindra Nilayam, Shiva Ganga Colony, L.B.Nagar, Hyderabad-74.
Mob: 98489975111

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE-CUM-IV ADDL. METROPOLITAN MAGISTRATE MEDCHAL MALKAJGIRI DISTRICT AT: L.B.NAGAR
O.S. NO. 31 OF 2023

BETWEEN:
1. **BHUPATHI BABU RAO,** S/O. LATE S B RAO, AGED ABOUT 52 YEARS, OCC BUSINESS, R/O. H.NO.1-9-6/A/202, SAI SUCHITRA APARTMENTS, AZAMABAD, ZB GARDEN, RAMNAGAR, HYDERABAD-500020.
2. **B MOHAN RAO,** S/O. LATE S B RAO, AGED ABOUT 62YEARS,OCC: PVT SERVICE, R/O. H.NO.1-9-6/A/202, SAI SUCHITRA APARTMENTS, AZAMABAD, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044.
3. **SMT. ASHA DEVI PENUMARTHY,** W/O. SAI KUMAR PENUMARTHY, AGED ABOUT 54 YEARS, OCC: PRIVATE SERVICE, R/O. H.NO.1-9-6/A/G2, SAI SUCHITRA APARTMENTS, AZAMABAD, ZB GARDEN, RAMNAGAR, HYDERABAD-500020.

...**PLAINTIFF NOS. 1 TO 3**
AND
1. **THE TAHSILDAR,** UPPAL MANDAL MEDCHAL-MALKAJGIRIDISTRICT.
2. **ALL THE CONCERNED** ..**DEFENDANTS**

TO.
**ALL CONCERNED (D2)**
PLEASE TAKE NOTICE THAT THE ABOVE SUIT IS FILED FOR DECLARATION TO DECLARE THE PLAINTIFFS NO.1 TO 3 AS THE LEGAL HEIRS OF THE LATE.SMT. B. RAJAMWHO DIED ON 25.12.2011. THE MATTER IS POSTED TO 03.03.2023 FOR APPEARANCE. IF ANY PERSONS HAVING ANY SORT OF RIGHT, OBJECTION OR CLAIM MAY APPEAR BEFORE THE HON'BLE COURT ON 03.03.2023. AT 10.30 AM. FAILING WHICH THE MATTER WILL HEARD AND DECIDED ON MERITS ON YOUR ABSENCE.

//BY ORDER OF THE COURT//

**T. SWETCHA,** Advocate
O/O. H.NO.2-2-109/5/B4, BAGH AMBERPET, AMBERPET, HDERABAD-13.
CELL: 948666696, 9052949248

**PUBLIC NOTICE**

My client **Sri. P. Omkar Patil, S/o Sri. Naga Setti,** aged about 50 years, Occ: Business, R/o H.No. 16-11-511/C/42, Prathap Nagar, Shalivahana Nagar, Dilsukhnagar, Hyderabad District, Telangana State states that he is the owner of Plot No.42, admeasuring 202 Sq.yds., or 169.07 Sq.Meteres., in Survey No.9/1/F, situated at Ward No.11, Block No.14, Haripuri Colony, Saroornagar Village and Revenue Mandal, within the limits of L.B. Nagar Circle, GHMC, Ranga Reddy District, forming part of and Bounded by: NORTH: Plot No.38 and 39, SOUTH: Road 25' Wide Road, EAST: Plot No.56, WEST: Neighbour's Land, having purchased the same from K.Ch. Naga Seshulu through Sale Deed Doc.No.338/2012 dated 25.01.2012 and registered before SRO, Saroornagar lost its original link document viz., Sale Deed Doc.No. 3549/1981 dated 13.03.1981 executed by The Vimalananda Co-operative Housing Society Ltd. rep. by its Secretary A.L. Narasimha Rao S/o Rama Rao in favour of K.Ch. Naga Seshulu registered by SRO, Saroornagar, while my client proceeding from Zaheerabad to Hyderabad on 27.12.2022. Founder of above document may kindly handover to me.

**Sd/- N.V. RAO,** Advocate
Block No.3, 14-2RT, Municipal Colony, Malakpet, Hyderabad-500036, Telangana State.
Cell No.9393013364

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE : RANGA REDDY DISTRICT AT L.B.NAGAR.
S.O.P.NO. 1 2023

Between :
1. **Smt. Ganji Mani,** W/o. Late Ganji Sathaiah.
2. **Ganji Sairam,** S/o. Late Ganji Sathaiah.
3. **Ganji Sandeep,** S/o. Late Ganji Sathaiah,
   Plaintiff Nos.1 to 3 are R/o. H.No. 15-145/17, Kodandaram Nagar, P & T Colony, Dilsuknagar, Hyderabad.
4. **Smt. Ravva Soujanya,** D/o. Late Ganji Sathiah, W/o. Ravva Vinod Kumar, R/o. Flat No.302, C-Block, Sri Kalki Heights, Manjeera Pipeline Road, Madinaguda, Chanda Nagar, Ranga Reddy District. ..**Petitioners**

AND
1. **The Branch Manager,** State Bank of India, 14-16, Sri Sai Mithra Enclave, P & T Colony, Dilsuknagar, Ranga Reddy District.
2. **All concerned** ..**Respondents**

Whereas the above named Petitioners filed the above SOP seeking to declare them as successors of Late Ganji Sathaiah in respect of the amount lying with State Bank of India, P & T Colony, Dilsuknagar, Ranga Reddy District and the matter is posted calling for any objections/claims of anybody concern, if any. Hence, if anybody is / are having any objections / claims, they may appear before the Hon'ble II Additional Senior Civil Judge, Ranga Reddy District at L.B.Nagar on 17-02-2023 at 10.30 AM, either in person or through an Advocate, failing which the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT//

**G. NARESH KUMAR**
Advocate
Off: 9-3-233, Champapet, Vyshali Nagar Post, Hyd-79
Cell : 98483 56307.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE : RANGA REDDY DISTRICT AT L.B.NAGAR.
O.S.NO. 14 2023

Between :
1. **Smt. Ganji Mani,** W/o. Late Ganji Sathaiah.
2. **Ganji Sairam,** S/o. Late Ganji Sathaiah.
3. **Ganji Sandeep,** S/o. Late Ganji Sathaiah,
   Plaintiff Nos.1 to 3 are R/o. H.No. 15-145/17, Kodandaram Nagar, P & T Colony, Dilsuknagar, Hyderabad.
4. **Smt. Ravva Soujanya,** D/o. Late Ganji Sathiah, W/o. Ravva Vinod Kumar, R/o. Flat No.302, C-Block, Sri Kalki Heights, Manjeera Pipeline Road, Madinaguda, Chanda Nagar, Ranga Reddy District. ..**Plaintiffs**

AND
1. **The Tahsildar,** Saroor Nagar Mandal, Saroor Nagar, Ranga Reddy District.
2. **All concerned** ...**Defendants**

Whereas my clients filed the above OS to declare them as Legal Heirs of Late Ganji Sathaiah who died on 21-06-2022 in respect of the schedule property bearing H.No. 15-145/17, Plot No. 13 (Southern Part) in Sy.No. 199, Land admeasuring 117 sq.yards or 97.82 sq.mtrs situated at Sri Kodandaram nagar Colony, Gaddiannaram Village, Saroor Nagar Mandal, Ranga Reddy District bounded by : NORTH : Neigh. House on Plot No. 13 Part, SOUTH : Plot No.6 EAST: Neigh. House No.15-145/22. WEST : 30' Wide Road and the matter is posted for objections / claims of anybody concern, if any. Hence, if anybody is / are having any objections / claims they may appear before the above said court on 17-02-2023 at 10.30 AM. either in person or through an Advocate, failing which the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT//

**G. NARESH KUMAR**
Advocate
Off: 9-3-233, Champapet, Vyshali Nagar Post, Hyd-79 Cell : 98483 56307.

## పారిశుద్ధ కార్మికురాలికి నష్ట పరిహారం అందించాలి : ఎమ్మెల్యే



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మరణించిన పారిశుద్ధ్య కార్మికురాలికి నష్టపరిహారం చెల్లించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల పదవ తేదీన విధి నిర్వహణలో భాగంగా పారిశుద్ధ్య కార్మికురాలు దుర్గమ్మ ఆటోనగర్ వద్ద విధి నిర్వహణలో ఉండగా వెనుక నుంచి లారీ వచ్చి ఆమెను ఢీకొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల అనంతరం దుర్గమ్మ మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేని సంప్రదించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌ని కలిసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మేయర్ రూ.2 లక్షలు, ఈఎస్ఐపీఎఫ్ క్రింద రూ.12 లక్షల నగదు ఇప్పించడం జరుగుతుందని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బాధితుల కుటుంబసభ్యులకు త్వరలోనే నష్ట పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. గతంలో కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన పారిశుద్ధ్య కార్మికులు పార్వతమ్మ, లింగయ్య, లక్ష్మమ్మల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని తెలిపారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి: తీగల కృష్ణారెడ్డి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని టిఆర్ఆర్ టౌన్‌షిప్ కాలనీలో నున్న తీగల రాంరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ కంటి జబ్బులతో ఎవ్వరూబాధపడవద్దనే ఉద్దేశ్యంతో సిఎం కెసిఆర్ ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవడానికి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వెల్లడించారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళద్దాలను అందిస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్ తీగల మాధవి సాయినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, పార్టీ నాయకులు ప్రమోద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ సిపితో ఉప్పల్ బిజెపి నేతల బేటి

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** రాచకొండ సిపి డిఎస్ చౌహాన్‌తో ఉప్పల్ బిజెపి నేతలు రేవల్లి రాజు, మార్నెని పణీందర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా బేటి అయ్యారు. ఈ సందర్భంగా సిసి చౌహాన్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర మరువలేనిదన్నారు. పోలీసులకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కొత్త సిపి నాయకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : అరవింద్



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న అరవింద్, నగేష్

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త :** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ మహేశ్వర నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురండివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ హరిపురి అసోసియేషన్ పార్క్‌లో కంటివెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ అయాచితం శ్రీధర్, నాయకులు సాజిద్, గొడుగు శ్రీనివాస్, నేలకొండ శ్రీనివాసరెడ్డి, కొండ శ్రీనివాస్, కంచర్ల శేఖర్, దుబ్బాక శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, ఎల్లన్న, వెంకటేష్‌గౌడ్, ముచ్చింతల జగన్ పాల్గొన్నారు.

## 4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం సభ్యులు

**హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర 4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన డైరీ ఆవిష్కరణ జరిగింది. జిల్లాలోని తహశీల్దారులు అందరి సమక్షంలో చేపట్టిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్,కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యులు జయమ్మ, స్వరూప, అశోక్‌కుమార్, బిక్షపతి, మహబూబ్ ఖాన్, చందు, జ్యోతి, సంధ్య, రఘుగౌడ్, జగదీష్, గాయత్రి, హైదర్ అలీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : హోంమంత్రి మహమూద్ అలీ



కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించిన హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యే బలాల, సునరితారెడ్డి తదితరులు

**మలక్‌పేట, జనవరి 20 ప్రభాతవార్త :** కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. అజంపుర డివిజన్ జట్‌పట్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రం, ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని సాలర్ ఎ మిల్లత్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్ర ప్రజలకోసం ఎంతో కృషి చేస్తున్నారని, కంటి వెలుగు కేంద్రాలను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైనవారికి కళ్ల అద్దాలు ఇవ్వడం, సర్జరీలు అవసరమైన వారికి సరోజని, ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు.

**మూసారాంబాగ్‌లో...** మూసారాంబాగ్‌డివిజన్‌లోని శ్రీపురం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే బలాల సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ భూమేష్, నాయకులు అబ్రార్, సైపుద్దీన్ షఫీ, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, తీగల అజిత్‌రెడ్డి, లాయఖ్‌అలీ, మునావర్‌ఖాన్, చల్లూరి రఘు నందన్‌రెడ్డి, కనుకుల రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాము యాదవ్, బాబు సుదర్శన్, పగిళ్ల నర్సింగ్, పవన్, నరేష్, యాదగిరి, ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.

## మాత జగజ్జనని దేవాలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు



అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న చేవూరి ఉషశ్రీ తదితరులు

**నాచారం, జనవరి 20 ప్రభాతవార్త:** మల్లాపూర్‌లోని శ్రీశ్రీ మాతజగజ్జనని ముగ్గురమ్మల దేవాయ ప్రాంగణంలో చేవూరి వాస్తు జ్యోతిష్య ఆధ్యాత్మిక నిలయం ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. దేవాలయ ప్రాంగణంలో భారీ ఆలయ నేమ్‌బోర్డును ఏర్పాటు చేయించారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు చేవూరి అరుణసుదర్శన్ తధితరులను ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి ఇంకా కార్యక్రమాలను చేపడుతామని చేవూరి ఉషశ్రీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టి.మల్లయ్య, శివరాం ప్రసాద్, ఎ.వెంకట్‌రెడ్డి, ఎస్.రాజు, శేఖర్‌రావు, వెంకటేష్, కృష్ణారెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరిస్తా : కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య



కాలనీవాసులతో కలిసి రోడ్డును చదును చేయిస్తున్న ఐలయ్య

**తుర్కయంజాల్, జనవరి 20 ప్రభాతవార్త :** కమ్మగూడ 22వ వార్డులో స్వామి వివేకనంద చౌరస్తానుండి కళ్యాణ వెంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రధాన రహదారి అనుకొని ఉన్నటువంటి వెంకటేశ్వర కాలనీ, సాయినగర్ కాలనీ, సాయి ప్రియ నగర్ కాలనీ, శివాజీ కాలనీ, బొక్క నారాయణరెడ్డి వెంచర్, రహదారి పూర్తిగా గుంతలమయమైందని కాలనీల ప్రజలు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐలయ్య ప్రజలను ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గుంతలమయమైన రోడ్డుని చదును చేయించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సత్యంగౌడ్,రాములుగౌడ్, రవి, భాస్కర్‌రెడ్డి, దొంతిరెడ్డి, శేఖర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, ఎం.రాజునాయక్, బ్రహ్మచారి, వెంకటేష్, శ్రీను, శ్రీనివాసచారి, హనుమంత్ గౌడ్, రాజునాయక్, సైదులుగౌడ్, హనుమనాయక్, శంకర్, మల్లారెడ్డి, జగన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో చక్కటి ఆరోగ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనంద్ రాజేంద్రన్, శ్రీనివాసరావు

**మలక్‌పేట, జనవరి 20 ప్రభాతవార్త :** యోగ ధ్యానంతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని ప్రముఖ అంతర్జాతీయ యోగ గురువులు ఆనంద్‌రాజేంద్రన్, శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ, ధ్యానం చేయాలని తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మన స్వంతం అవుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏ పని నైనా చేయగలుగుతామన్నారు. యోగ, ధ్యానంతో మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ నెల 22వ తేదీవరకు కొనసాగుతుందని ఎబిసి సభ్యులు దడువై రాధాకృష్ణ తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుండి వందలాది మంది ఈ కార్యక్రమానికి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దడువై శిల్ప, వాణిబాల, సుప్రియ, ఆష, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి 18 రోజులు జైలు శిక్ష

**మలక్‌పేట, జనవరి 20 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించి న్యూసెన్స్ చేసిన ఓ వ్యక్తికి 18 రోజులు జైలుశిక్ష విధించిన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ కథనం ప్రకారం డయల్ 100నుండి కాల్ రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసు సిబ్బందిపై మలక్‌పేట బ్రహ్మనందనగర్ చెందిన మహ్మద్ అజీం (37) దురుసుగా ప్రవర్తించడంతోపాటు వారి విధులకు ఆటంకం కలిగించిన న్యూసెన్స్ చేయడంతో అతనిపై కేసు బుక్ చేసి 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరిచారు. దీంతో అతనికి 18 రోజులు జైలు శిక్ష విధించడం జరిగిందని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపట్ల ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## దశలవారిగా పనులను పూర్తి చేసి సమస్యలు లేకుండా చూస్తాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

**హయత్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** దశలవారిగా అభివృద్ధి పనులను పూర్తిచేసి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా శుక్రవారం ఉదయం ఆయన డివిజన్ పరిధిలోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సదుపాయం,రోడ్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమస్యను విన్నవించారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో అభివృద్ధి పనులను పూర్తిచేసి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సూర్య, నర్సింహాచారి, రామకృష్ణ, మూర్తి, నరేన్ పాల్గొన్నారు.

**పనులను వేగంగా పూర్తిచేయాలి...** తొర్రూర్ రోడ్డులో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలాపనులను, బాతుల చెరువు నుంచి బంజారా కాలనీ ఔట్‌లెట్ వరకు కొనసాగుతున్న డ్రైనేజీట్రంక్‌లైన్ పనులను కార్పొరేటర్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, పనులను రోజువారిగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణయ్య, జలమండలి మేనేజరు రాజు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ వెంటనే విడుదల చేయాలి



చంపాపేటలో రాస్తారోకో చేస్తున్న బిజెవైఎం, బిజెపి నాయకులు

**సైదాబాద్, జనవరి 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు పవన్, ఉపాధ్యక్షుడు సిలివేరు అనిల్‌కుమార్ ల ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలో ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణారాష్ట్రం వస్తే బతుకులు బాగుపడుతాయని, ఉద్యోగాలు వస్తాయని సకల జనులు స్వరాష్ట్ర పోరాటంలో పాల్గొన్నారని, అయితే రాష్ట్రం వచ్చిన తర్వాత కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. పీజు రీయంబర్స్ మెంట్స్, స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. పీజు రీయంబర్స్ మెంట్స్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని లేకపోతే బిజెవైఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల సూర్య ప్రకాష్, జైపాల్, సురేష్, రాజేష్, శ్రీశైలం, టింగ్లికార్ రాజేష్, ప్రదీప్ కుమార్, రాంపురం శ్రీనివాస్, భానుక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవం



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, బ్రదర్ జోసెప్ పసల తదితరులు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ 16వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె.శశాంక ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. గత ఏడాదితో ఉత్తమ శ్రేణిలో నిలిచిన విద్యార్థులు బ్రదర్ జోసప్ పసల అవార్డులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు పట్టుదల, ఆత్మ విశ్వాసంతో సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవ.బ్రదర్ జాన్ కల్లెరకల్,కరస్పాడెంట్ రెవ.బ్రదర్ విన్సెంట్ రెడ్డి, బ్రదర్ ఎం.ఎ.జార్జి, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి సబితా ఇంద్రారెడ్డికి యువత, నేతల సంఘీభావం



మంత్రిని కలిసిన యువకులు, కాంగ్రెస్ నేతలు

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన యువకుల బృందం సంఘీభావం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ యువ నేత గజ్జెల అనిల్ ఆధ్వర్యంలో పలువురు యువకులు మంత్రిని కలిసారు. అదే విధంగా కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండిరాళ్ళ రాజుతో పాటు పలువురు కూడా మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పార్టీలో చేరికల విషయమై మంత్రితో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో సబితారెడ్డి పని తీరు భేషుగ్గా ఉందనీ ఆమె చొరవ వల్ల చెరువుల సుందరీకరణ, ప్రధాన రహదారుల విస్తరణ అభివృద్ధి పనులతో పాటు ఎన్నో పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సబితారెడ్డి అండగా ఉండి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఆమె గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, ఉయ్యాల నవీన్‌గౌడ్, బిఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు దిండు భూపేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ నాయక్, బండి నాగేశ్ యాదవ్, రాజ్‌కుమార్, ఎరుకల రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త :** నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే ఉత్సవాలు జిల్లాలగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించగా రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్‌జడ్జ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీదేవి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలు చిన్నారుల పరిరక్షణకు సంబంధించి పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారుల పట్ల వేధింపులకు పాల్పడిన ఇతర చట్ట విరుద్ధమైన పనులు చేసిన కచ్చితంగా వారిని న్యాయస్థానం శిక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామలాదేవి, సరళరెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా : కమిషనర్ సాబేర్ అలీ

**తుర్కయంజాల్, జనవరి 20 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎండీ సాబేర్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాబేర్ అలీ మాట్లాడుతూ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. మూడేళ్ల పాటు శంషాబాద్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సాబేర్ అలీ బదిలీపై తుర్కయంజాల్ వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా విధుల్లో ఉన్న ఎంఎస్ఆర్ జ్యోతి సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లిన విషయం తెలిసిందే.

## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిపికి సత్కారం

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్ అద్వర్యంలో శుక్రవారం రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సరం డైరీని అందజేశారు. కార్యక్రమంలో రాక సుధాకర్ ,మురారి, మహేశ్వరం అసెంబ్లీ కో-కన్వీనర్ బెనగరబోయిన సురేష్, సరూర్‌నగర్ డివిజన్ కన్వీనర్ నవత్ శైలేష్ తదిరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సు సర్వీసు పునరుద్ధరణ కోసం వినతి

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 30వ డివిజన్ కాలనీలకు ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి మిథాని డిపో అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె డిపోలో మేనేజర్ ఆంజనేయులు, డివిజనల్ మేనేజర్ జగన్‌లను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్వప్న జంగారెడ్డి మాట్లాడుతూ గతంలో తమ డివిజన్‌లోని కాలనీలకు బస్సు సౌకర్యం ఉండేదనీ అయితే ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పనుల వల్ల రోడ్లపై రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో బస్సు సర్వీసులను నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో పాటు కొత్తగా బిటి రోడ్డు నిర్మాణం జరగడం వల్ల రహదారి చక్కగా తయారైందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం తిరిగి బస్సు సర్వీసులను నడపాలని ఆమె డిఎంను కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన మేనేజర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రూట్ సర్వే ఇంఛార్జి స్వామిగౌడ్, బడంగ్‌పేట్ సీనియర్ నాయకుడు భీమిడి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేది లేదు: కార్పొరేటర్ శ్రీవాణి

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపినందుకే తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని బిజెపికి చెందిన జిహెచ్ఎంసి సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి వైఫల్యాలు, అనుచరుల భూకబ్జాలను ప్రశ్నించినందుకే తనను కేసుల పేరిట వేధిస్తున్నారని ఆమె తెలిపారు. శుక్రవారం ఆమె పలువురు బిజెపి నాయకులతో కలిసి పహాడీషరీఫ్ పిఎస్‌కు వెళ్ళి తనపై బనాయించిన కేసుల విషయమై తన వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్‌కు ఆమె వివరణ లెటర్‌ను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై నమోదు చేయించిన తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ఓడించి బిజెపిని గెలిపించుకుంటామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్ శర్మ, సుధాకర్, గుర్రం మల్లారెడ్డి, ఆరుట్ల సురేష్, మదన్మోహన్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, మధు, రామిడి శూరకర్ణారెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సర్వ సౌభాగ్య దేవిత్రయ గీతా జ్ఞాన యజ్ఞం



ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**సైదాబాద్, జనవరి 19 ప్రభాతవార్త:** లోక కళ్యాణార్థం కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న 1869వ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీతా జ్ఞాన యజ్ఞం శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం యాగాశాల ప్రదక్షణం, శ్రీ మహా గణాధిపతి, గో పూజ, మంటపాధిష్ఠిత దేవతల ప్రాతకాల పూజాదులు, మహారుద్రాభిషేకము, బిల్వార్చన, కనక దుర్గమ్మవారికి అష్టాదశ ద్రవ్యాలతో విశేషాభిషేకము, లలిత సహస్రనామ సప్తశతి చండీ రుద్ర హవనము, మహా పూర్ణాహుతి, మహానివేదన, రాజోపచారములు, మహామంగళ హారతి, ఆచార్య పూజ, మహా ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శివ పార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెలే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బిజెపి నాయకులు ఆచారి, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు కల్వ సుజాత తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వరశర్మ, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తాలతో పాటు సురేష్‌గుప్తా, జడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌గుప్తా, ఎంపిపి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ : రాగిడి



కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు కంప్యూటర్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, పిసిసి ప్రతినిధి మేకల శివారెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్ డివిజన్‌లో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు మధురా ట్రస్ట్ తమ వంతు కృషి చేస్తుందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు, ఉపాధి కల్పనకు కంప్యూటర్‌శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలుస్తారని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి కల్పించి చేయూత అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిలుకానగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు దాసరి కృష్ణ, బూర్గుల రమేష్‌గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు మదర్‌వలీ, కరిపె సంతోష్, బొల్లం లక్ష్మణ్, జహంగీర్, సాయిబాబా, నరేష్, సురేందర్‌రెడ్డి, అభి, గణేష్‌నాయక్, సంజయ్‌జైన్, పుల్లారెడ్డి, రాజు, హనుమంత్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## కార్మికురాలు కుటుంబానికి అండగా నిలుస్తాం : చిలుక



బియ్యం పంపిణీ చేస్తున్న చిలుక మధురఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** పారిశుద్ధ కార్మికురాలు కుటుంబానికి తమ అండగా నిలుస్తామని యోజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురండివిజన్‌పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా పారిశుద్ధ విభాగంలో పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తున్నా మిర్యాల లక్ష్మి గత నాలుగు రోజుల క్రితం మరణించింది. ఆ విషయం తెలిసిన వెంటనే మానవతా దృక్పథంతో మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు లక్ష్మితో పని చేసే తోటి కార్మికులను పిలిచి లక్ష్మి దశదిన కర్మకు కావలసిన సరుకులు, క్వింటాల్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్ది వేణుగోపాల్‌రెడ్డి, వంగాల శ్రీకాంత్, జహంగీర్, అంజి, జగదీష్, అనిల్, కలీద్‌భాయ్, శివ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ పోలీస్ కమిషనర్‌ను సన్మానించిన విహెచ్‌పి నాయకులు



కమీషనర్‌ను సన్మానిస్తున్న విహెచ్‌పి నాయకులు

**వనస్థలిపురం, జనవరి 20 ప్రభాతవార్త :** రాచకొండ పోలీస్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్.చౌహాన్ ఐపిఎస్‌ను శుక్రవారం విశ్వహిందూపరిషత్ రాష్ట్ర సహా కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కమీషనర్‌తో జరిగిన ప్రత్యేకసమావేశంలో హిందూ అమ్మాయిల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయాలని, రాచకొండ కమీషనరేట్ పరిధిలో జరుగుతున్న గోవుల అక్రమ రవాణా అరికట్టాలని, బలవంతపు మతమార్పిడి ముఠాలపై ఉక్కుపాదం మోపాలని, రాచకొండ కమీషనరేట్ పరిధిలో అక్రమంగా తిష్ఠ వేసిన రోహింగ్యా ముస్లింలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని విద్యా సంస్థల కేంద్రంగా సాగుతున్న డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని కమీషనర్ కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆయన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.